గ్రామాలకు ప్రత్యేక గ్రాంట్

- కెసిఆర్‌కు మళ్లీ అధికారం కల్ల
- నేను రాజకీయం చేసినంతకాలం మరచిపోవడమే
- 2029లోనూ మళ్లీ కాంగ్రెస్ విజయ ఢంకా మోగిస్తుంది
- కోస్గి ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నూతన సర్పంచ్‌లతో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నిన్నటి వరకు ఒక లెక్క.. రేపటి నుంచి మరో లెక్క.. నేను బయటకు వచ్చి తోలు తీస్తాను అంటున్న మాజీ సిఎం కేసీఆర్.. మటన్‌కొట్టు మాస్టర్‌కు చెప్తా.. అక్కడికి వెళ్లి తోలు తీసుకో.. పాస్‌పోర్ట్ వ్యవహారంలో బ్రోకర్‌గా పనిచేసి లక్షలాది మంది కుటుంబాలను రోడ్డున పడేసిన నీవా నాకు చెప్పేది.. తోలు తీసుడు కాదు.. మీ తోలు సంగతి చూసుకోండి.. మా సర్పంచులు చీరి చింతకు కట్టి చింతమడకకు పంపిస్తారు జాగ్రత్త.. మీ గాంఢ్రింపులకు, బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరు.. రెండు సంవత్సరాల తర్వాత ప్రభుత్వానికి సలహాలు సూచనలు ఇస్తారని అనుకున్నాను. సోయిలేని మాటలు స్థాయి లేని విమర్శలు చేసుకుంటూ ప్రజలకు పనికొచ్చే మాటలు ఒక్కటైనా మాట్లాడలేదు. 40 ఏండ్ల రాజకీయం.. పదేండ్ల ముఖ్యమంత్రి అనుభవం కలిగిన కెసిఆర్ రెండేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టడం ఆయన అనాలోచిత విధానాలకు నిదర్శనం.. నేను రాజకీయాల్లో ఉన్నంతకాలం కెసిఆర్ అధికారంలోకి రావడం కల్లనే.. ఈయన కుటుంబం కూడా రాదు. కెసిఆర్, బిఆర్ఎస్ చరిత్ర గతంగా మిగిలిపోతుంది.. కొడంగల్ సాక్షిగా ఇదే నా శపథం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

నారాయణపేట జిల్లా కోస్గిలో బుధవారం నూతన సర్పంచ్‌లకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యం అన్న మహాత్మాగాంధీ మాటలు ఇప్పటికీ ఆచరణీయమని చెప్పారు. సర్పంచులు ప్రజలకు ఇచ్చిన హామీలను తన దగ్గర చెప్పాలని వచ్చారని, వారి హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి నిధుల నుంచి స్పెషల్ గ్రాంట్ ద్వారా అత్యధిక నిధులు పంచాయతీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో గుడి, బడి, విద్య, వైద్యం, ఉపాధి, ఆవాసం తదితర వాటి కోసం పెద్దపీట వేస్తున్నామని అన్నారు. కొడంగల్ యువత కోసం ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా గుర్తించి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిశాయి.. ఎన్నికల వరకు రాజకీయాలు చేసి ఎన్నికలు పూర్తికాగానే రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని కొడంగల్ వేదికగా 12706 గ్రామ పంచాయతీలకు ఆయన సూచించారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ప్రజాసేవ చేయాలని చెప్పారు. ఆర్థిక కారణాల రీత్యా గ్రామాలను అభివృద్ధి చేసుకోలేకపోవచ్చు కానీ, ఎస్‌డిఎఫ్ నిధులను గ్రామాలకు మళ్లించి అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. కొత్తగా గెలిచిన సర్పంచులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి ఎన్ని నిధులు అవసరమో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక గ్రాంట్ కింద చిన్న గ్రామాలకు రూ.ఐదు లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.పది లక్షల చొప్పున కేటాయిస్తామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులకు ఇది అదనం అన్నారు. కోటి మంది ఆడబిడ్డలకు ఇస్తున్న ఇందిరమ్మ చీరలను సారె చీరలుగా గుర్తించాలని కోరారు.

నేను వ్యక్తిగత కక్షలకు పాల్పడబోను

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలతోపాటు పాలమూరు-రంగారెడ్డిని ఎందుకు పూర్తి చేయలేదని కెసిఆర్‌ను ప్రశ్నించారు. 2009లో వచ్చిన వరదల కారణంగా ముంపుకు గురైన వారిని కాపాడటానికి తన సొంత ఇల్లు అమ్ముకునైనా ఇల్లు నిర్మించి ఇస్తానన్న హామీ ఏమైందన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్టు పదేండ్లలో వాళ్లు చేసిన అప్పులు గుదిబండగా ఉన్నాయన్నారు. "నా కోపాన్ని దృష్టిలో పెట్టుకుని పగ సాధించాలనుకుంటే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఊరుకున్నా. ఫామ్‌హౌస్‌లో బందీగా మారిన ఆయన.. వాళ్ల పాపాన వారు పోతారని ఊరుకున్నా. తొడుక్కోవడానికి చెప్పులు, వేసుకోవడానికి బట్టలు లేని వాళ్లకు వేల కోట్ల ఆస్తులు వచ్చాయి తప్ప పాలమూరుకు నీళ్లు రాలేదు' అన్నారు. తనపై 181 కేసులు అక్రమంగా బనాయించి జైలుకు పంపారని అన్నారు. "నేను తలుచుకుంటే కెసిఆర్ కుటుంబాన్ని మొత్తం జైలుకు పంపేవాడిని.. కానీ, వ్యక్తిగత కక్షలకు పాల్పడబోను" అని అన్నారు. ఫ్యూచర్ సిటీపై వ్యంగ్యంగా మాట్లాడారని, కానీ తెలంగాణ రెండేండ్ల అభివృద్ధిపై చర్చిస్తే రాళ్లు కట్టుకొని మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని హెచ్చరించారు. పడావు పెట్టిన ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.20లక్షల చొప్పున జమ చేశామని గుర్తు చేశారు. 'ప్రజా ప్రభుత్వంలో ప్రతీ పేద కుటుంబానికి సన్న బియ్యం అందిస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. తొమ్మిది నెలల్లో రూ.తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా అందించాం. మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం' అని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చూసే బాధ్యత తనదేనన్నారు. వచ్చే అకడమిక్ నుంచి విద్యార్థులకు చదువుతోపాటు అల్పాహారం, భోజనం అందిస్తామన్నారు.

నా భర్త ఫోన్ ట్యాపింగ్ చేశారని వాళ్లింటి ఆడబిడ్డనే చెబుతున్నారు

2029 ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించి కాంగ్రెస్ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. "రేవంత్‌రెడ్డి రాజకీయాలు చేసినంత కాలం కెసిఆర్ అధికారంలోకి రావడం కల.. కల్లు కాంపౌండ్‌లో మాట్లాడే కెటిఆర్ వన్ బై థర్డ్ మెజార్టీ కాంగ్రెస్‌కు వచ్చిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని అన్నారు. "రెండేండ్ల తర్వాత కెసిఆర్ బయటకు వచ్చి సభలు పెడతారట.. పది మందిని వెనకేసుకుని పొంకనాలు కొట్టుడు కాదు.. అసెంబ్లీలో చర్చిద్దాం రండి.. ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం శాసనసభలో మాట్లాడాలి. లేకుంటే పశువులను, బర్రెలు కాచే పనిలో ఉండు.. సొంత బిడ్డకు వాటా ఇవ్వని తండ్రి.. ఈ ప్రజలకు ఏమి న్యాయం చేస్తారు.. సొంత చెల్లెలి భర్త ఫోన్ ట్యాపింగ్ చేశారని వాళ్లింటి ఆడబిడ్డనే చెబుతున్నారు. సొంత చెల్లెలికి సమాధానం చెప్పలేని కెటిఆర్ నాకు సవాల్ విసురుతున్నారు.." అని అన్నారు. 'రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా అంటున్నారు.. ఇదేం దుబాయ్ పాస్‌పోర్ట్ బ్రోకర్ దందా కాదు. నేనేం పాస్‌పోర్టు బ్రోకర్ దందా చేయలేదు.. అయ్య పేరు చెప్పుకుని మంత్రి పదవి తీసుకోలేదు.. మా జోలికి వస్తే మా కార్యకర్తలు ఊరుకోరు' జాగ్రత్త అని హెచ్చరించారు.

2029 ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటుతాం

2029లో ఎవరి లెక్క వారిదే.. కాంగ్రెస్ ప్రజల మనసులను చూరగొని విజయం సాధిస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 87 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. 150 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100కు పైగా స్థానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుస్తుందన్నారు.కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు మార్గదర్శకం

క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పిన సిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రిస్టియన్ సోదరీ,సోదరులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతటా క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమని తెలిపారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని ఆయన ఎంచుకున్న మార్గం ఆదర్శనీయమని సిఎం పేర్కొన్నారు. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని దర్శించాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆలయ ఈవో వెంకట్రావు, అర్చకులు ఆహ్వానించారు.

గ్రామాల్లో ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవనాలు

రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణం

ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీ రాజ్ శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ మహిళల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలు, ఫెడరేషన్‌లకు శాశ్వత వేదికగా నిలిచే భవనాల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ డి.సృజన బుధవారం సర్క్యులర్ జారీ చేశారు. గ్రామ సంస్థలు (విఒ), సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు(ఎస్‌హెచ్‌జీ) ఫెడరేషన్ల కోసం శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వానికి ఎంతో కాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఒక్కో భవనానికి గరిష్టంగా రూ.10 లక్షల వరకు వ్యయం చేయనున్నారు. 200 గజాల్లో, కనీసం 552 చదరపు అడుగుల్లో భవనం ఉండేలా డిజైన్ సిద్ధం చేశారు. గ్రామ సభ తీర్మానం ఆధారంగా ప్రతిపాదనలు మండల, జిల్లా స్థాయిల ద్వారా జిల్లా కలెక్టర్ అనుమతితో పనులు చేపట్టనున్నారు. నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో పూర్తిచేస్తారు. ఉపాధీ హామీ నిధులతో చేపట్టే పనులకు సామాజిక తనిఖీ తప్పనిసరిగా నిర్వహించనున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తైన ఆరు నెలలలోపు సోషల్ ఆడిట్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

దశల వారీగా నిర్మాణం: సీతక్క

స్వయం సహాయక సంఘాలు, ఫెడరేషన్‌లకు దశల వారీగా శాశ్వత భవనాలను నిర్మించనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామీణ మహిళలు పొదుపు సంఘాలకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి, నిర్ణయాధికార కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

27న కమ్యూనిస్టు పార్టీ శత వార్షిక సభ

సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 2025 డిసెంబర్ 26 నాటికి వందేండ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్టు సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నో త్యాగాల, పోరాటాల వారసత్వం కమ్యూనిస్టులదనీ, వారి పోరాటాలను, అనుభవాలను నెమరు వేసుకుంటూ వైఫల్యాలను గుర్తించి భవిష్యత్ కర్తవ్యాలను ఆలోచించు కోవాల్సిన తరుణం ఇది అని తెలిపారు. ఈ నేపథ్యంలో 27న మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నామనీ, అందులో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం, స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్ట్ పార్టీ పాత్ర, అతివాద, మితవాద విధానాలు - కమ్యూనిస్ట్ పార్టీలో విభజనలు, మాస్ లైన్ విధానాలు' అనే అంశాలపై ప్రసంగాలుంటాయని తెలిపారు. ఆ సదస్సులో బత్తిన శ్రీనివాసరావు, భార్గవ, పోటు రంగారావు, కేజీ రామచందర్ , కె.రమ, వి.కృష్ణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణ, గుమ్మడి నర్సయ్య తదితరులు

ప్రాణం తీసిన పెన్సిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్సిల్ గొంతులో దిగి విద్యార్థి మృతిచెందిన సంఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో జరిగింది. మేడారపు విహార్(6) నాయకన్ గూడెంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో తోటి పిల్లలతో ఆడుతూ ఉండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఆ సమయంలో తన జేబులో ఉన్న పెన్సిల్ గొంతులోకి దిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు.

కుక్కకాటుకు బాలిక మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిచ్చికుక్క కాటుకు తొమ్మిదేండ్ల బాలిక మృతి చెందారు. ఈ విషాదకర ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామంలో చోటుచేసుకుంది. బచ్చలకూర రమేశ్ కూతురు అవంతిక(9) ను నెల రోజుల కిందట పిచ్చికుక్క కాటు వేసింది. హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు.

న్యూటన్ స్కూల్‌లో భారీగా ప్లేస్‌మెంట్స్

హైదరాబాద్ : ప్రముఖ టెక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ 'న్యూటన్ స్కూల్' ప్లేస్‌మెంట్లలో హైదరాబాద్ విద్యార్థులు సత్తా చాటారని పేర్కొంది. నగరంలో నిర్వహించిన నియామకాల్లో సుమారు 500 మంది అగ్రశ్రేణి కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని పేర్కొంది. జాతీయ స్థాయిలో అత్యధికంగా రూ.1.5 కోట్ల వార్షిక ప్యాకేజీ అందుకున్న అభ్యర్థులున్నారని న్యూటన్ స్కూల్ కోఫౌండర్ నిషాంత్ చంద్ర తెలిపారు. ప్రతిభావంతులైన టాప్ 10 శాతం విద్యార్థులు సగటున రూ.18 లక్షల ప్యాకేజీని దక్కించుకున్నారన్నారు.

మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు

ఇన్సిడెంట్ ఫ్రీ న్యూ ఇయర్ చేసుకోవాలి - రాచకొండ సిపి సుధీర్ బాబు

ఆర్గనైజేషన్ నిర్వాహకులకు దిశానిర్దేశం చేస్తున్న సుధీర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రశాంత వాతారణంలో ఇన్సిడెంట్ ఫ్రీ న్యూ ఇయర్‌గా వేడుకలను చేసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాచకొండ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాచకొండ పరిధిలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్స్, ఫామ్ హౌస్‌లు, వైన్ షాపులు, ఈవెంట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులతో హైదరాబాద్ వనస్థలిపురంలో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఅధికారులకు దిశా నిర్ధేశంతో పాటు పలు సూచనలు చేశారు. ఇన్సిడెంట్ ఫ్రీ న్యూఇయర్‌గా జరుపుకోవాలన్నారు. ఆరోజు ఒక్క యాక్సిడెంట్ కూడా జరగకూడదని, ఏ ప్రాణం పోవద్దని, రక్తం చిందకూడదని కోరుకుంటున్నామని అన్నారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. సివిల్, ట్రాఫిక్, ఎస్‌ఓటి, షి టీమ్స్, పెట్రోలింగ్ సిబ్బందితోపాటు ప్రత్యేక పోలీస్ బృందాలు విధుల్లో ఉంటాయన్నారు. ఔట్ డోర్ కార్యక్రమాల్లో డీజే బాక్సులకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడానికి వీల్లేదని అన్నారు. పరిమితికి మించిఈవెంట్‌లోకి ప్రేక్షకులను అనుమతించకూడదన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని, తమ షీ టీమ్ బృందాలు నిఘా వేస్తాయని చెప్పారు. న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి ప్రత్యేక పోలీసులు తనిఖీలు చేస్తారని, నిషేధిత డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల మీద ఉక్కుపాదం మోపుతామని అన్నారు. పబ్‌లు, బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయంలోపు మూసేయాలని, మైనర్లకు మద్యం విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయాలని, షాపులు, పబ్‌లు, రెస్టారెంట్‌ల పరిసరాల్లో సీసీ టీవీలు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫామ్‌హౌస్‌లలో కార్యక్రమాలు కూడా నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. రోడ్ల మీద ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలను కట్టుదిట్టంగా అమలు చేయాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు చేయకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా వేశామన్నారు. ఫ్లై ఓవర్‌లను మూసేస్తామని చెప్పారు.

పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- 'సృష్టి' కేసులో నిందితులు బెయిల్‌పై వచ్చి మళ్లీ అదే దందా : రితిరాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలను విక్రయిస్తున్న ముఠాను మియాపూర్, శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్త దాడి చేసి అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డిసిపి రితిరాజ్ బుధవారం డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మాదాపూర్ పోలీసులు, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పిల్లలను విక్రయిస్తున్న 11 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. 11 మంది ముఠా సభ్యుల్లో ఎనిమిది మంది మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఇద్దరు చిన్నారులను శిశువిహార్ కేంద్రానికి తరలించారు. నిందితులు హర్షరాయ్, దారం లక్ష్మీ.. అహ్మదాబాద్ నుంచి చిన్నారులను, తెలంగాణలోని సిద్దిపేట్ నుంచి ఒక బాబును కొనుగోలు చేసి తీసుకువచ్చి.. పిల్లలు లేని దంపతులకు వారి ఆర్థిక స్థోమతను బట్టి రూ.ఆరు లక్షల వరకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఈ గ్యాంగ్‌పై గతంలో అనేక కేసులు నమోదయ్యాయని, వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచామని అన్నారు. వారు మళ్లీ ఇదే పని చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తమ బృందాలు పట్టుకున్నాయని తెలిపారు. ఇందులో ప్రధాన నిందితుడైన గంగాధర్‌రెడ్డి.. గతంలో సృష్టి ఐవిఎఫ్ సెంటర్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని చెప్పారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ కేసులో బెయిల్‌పై వచ్చిన వెంటనే మళ్లీ పాత పద్ధతిలోనే తన పని కొనసాగిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు.

వినియోదారుల హక్కుల గురించి తెలుసుకోవాలి

- పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వినియోగదారులకు ఉన్న హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. ముఖ్యంగా విద్యార్థులను ఈ విషయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో రాష్ట్రస్థాయి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం పౌరులకు విద్యార్థులకు వారి ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కల్పించడం, వినియోగదారుల వివాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం, వేగంగా పరిష్కరించడంలో డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల ప్రాముఖ్యతపై ఐదురోజులపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. 'వినియోగదారుల హక్కులు...చట్టం' అనే అంశంపై కళాశాలలు, పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామన్నారు. అనంతరం మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన (36) విజేతలకు రూ.5000, రూ.3000, రూ.2000 చొప్పున నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లను అందజేశారు.

నీటిద్రోహంపై జవాబు చెప్పండి?

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా బుధవారం స్పందించారు. 2028 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను బొందపెట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గొంతుకోసి, సొంత జిల్లానే రేవంత్‌రెడ్డి దగా చేస్తున్నారని తెలిపారు. ఆయన నిర్వాకం బయటపడటంతో తట్టుకోలేక అహంకారంతో అరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి హక్కులపై రాజీపడ్డ విషయాన్ని బయటపెడితే సమాధానం చెప్పలేక చిల్లర డైలాగులతో చిందులు తొక్కడం రేవంత్ నైజమని విమర్శించారు. తెలంగాణ సోయి లేని, రాష్ట్ర ప్రయోజనాలను రక్షించలేని కోవర్ట్ బతుకు ఆయనదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విధ్వంసక పాలనతో ప్రజలను చావగొడుతున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టపగలు నోట్ల కట్టలతో దొరికిపోయిన 'ఓటుకు నోటు' దొంగవనీ, అదే ఆయన స్థాయి అంటూ రేవంత్ రెడ్డి గతాన్ని గుర్తు చేశారు. రాబోయే శాసనసభలోనూ, జనసభలోనూ ప్రతిచోటా కాంగ్రెస్ చేస్తున్న జలద్రోహాన్ని ఎండగడతామని స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రానికి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమనీ, పౌరుషం గల బిడ్డలుగా ప్రశ్నిస్తామని పునరుద్ఘాటించారు. తాము ఆత్మగౌరవం లేని ఢిల్లీ బానిసలం కాదనీ, రైతన్నల హక్కులకు భంగం కలిగితే భగ్గున మండుతామని హెచ్చరించారు.

అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం

ప్రజా సంక్షేమమే లక్ష్యం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజల ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టామని, అలాఅని చెప్పి అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి లబ్దిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరు విషయంలో సీరియస్‌గా ఉండాలని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలో ఉన్నత స్థానంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీ సమయంలో ముందుగా వెళ్లి ఫేస్ రికగ్నైజేషన్, థంబ్ ఇంప్రెషన్ ఇస్తున్నామని అన్నారు. ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని జీతాలుగా పంచుతున్నామని, కాబట్టి ప్రజలకు అందరం జవాబుదారీగా ఉండాలని సూచించారు. గిరిజనులకు సమగ్ర వ్యవసాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఇందిరా సౌర గిరి జలవికాసం పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. అటవీ భూ హక్కుల చట్టం కింద భూములు పొందిన రైతులకు ఉచితంగా సోలార్ విద్యుత్తు, పంపుసెట్లు, డ్రిప్పు, ప్లాంటేషన్ సౌకర్యాలు కల్పిస్తామని, అధికారులు ప్రతిపాదనలను వేగంగా పంపాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని, గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున వినియోగంలోకి తెచ్చుకోవాలని కోరారు.

మన బిడ్డలే రాష్ట్ర భవిష్యత్తు అని, వారు ప్రపంచంతో పోటీ పడాలన్న ఆలోచనతో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం ఎదిగేందుకు 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని భట్టి విక్రమార్క అన్నారు. విలువైన మానవ సంపదను సృష్టించేందుకు విద్యారంగంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుందని చెప్పారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని, అలాగే విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
I.A 64/2022 in I.A 848/2018 IN O.S 222/2016
AND
I.A.66/2022 in I.A.848/2018 in O.S.No.222/2016
Between:
1.K.Kesava Reddy (died) by Lrs
2.K.Savithramma
3.K.Lakshminarayana Reddy Rep GPA holder K.Savithramma
4.K.Sarada
...Petitioners
And
1.C.C.Ramaiah
2.K.Saraswathi Reddy
3.K.Radhika ...Respondents
NOTICE TO R2 & R3
To,
R2: K.Saraswathi Reddy W/o B.Chandrasekhar Reddy Flat No. 504, Sundar Nagar, Near ESI Hospital, Hyderabad, Telangana State
R3: K.Radhika W/o A.Shashidar Reddy, R/at #201. Sai Pavan Heights, Mathrusree Nagar, Miyapur, Near Aparna County, Hyderabad, Telangana State.
The above I.A 64/2022 AND I.A 66/2022 is posted to 06.01.2026 for your appearance. Please be attend on 06.01.2026 at 10:30 a.m before the above mentioned court either personal or through advocate, failing which the matter will be decided exparte.
(By Order of the Hon'ble Court)
K.SREENATHA REDDY
Advocate for the petitioners,
Ananthapuramu, Cell No: 9440986932

BEFORE THEHON'BLE VII SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT :: HYDERABAD
O.S. No.1658 of 2025
Between:
Smt Divipala Himavath Kumari, wife of late Divipala Chandra Sekhar and others.
...Plaintiffs.
AND
1) The Greater Hyderabad Municipal Corporation, rep. by it's Deputy Commissioner, Circle No. 12, Mehdipatnam, Khairatabad Zone, Hyderabad - 500028 Telangana State
2) The Commissioner, Isnapur Municipality, ISNAPUR, Pashamylaram Road, Sangareddy District.
3) ALL CONCERNED
...Defendants.
Please take notice that the plaintiffs have filed the above suit praying for passing of judgment and decree in favour of the plaintiffs and against the defendants by way of declaration declaring :-
(1) That the Plaintiffs No. (1) to (3) being the legal heirs of late Divipala Chandra Sekhar s/o D. Basavaraju have succeeded to the suit schedule 1 and 2 properties, on his death on 30.03.2024 and that the plaintiff No. 1, viz., Smt Divipala Himavath Kumari w/o late Divipala Chandra Sekhar is exclusively entitled to deal with the suit schedule 1 residential flat No. 103 (ground floor) in house bearing No. 10-3-16/2/A/1 admeasuring of 711 Sq. yards (80 x 80) equivalent to 591.46 sq. mtrs. situated at Asifnagar, Hyderabad previously known as KHAJA GULSHAN, previously Taluk: West now in Golconda Mandal, Ward No. 10, Block No. 3 of Municipal Corporation of Hyderabad, now in GHMC, Circle No. 12, Khairatabad Zone, Hyderabad together with all the fittings and fixtures attached thereto; and also the suit schedule 2 property, i.e., the land bearing plot No. 232 admeasuring 199.60 or 200.00 Sq. yards or 166.89 Sq. Mtrs. layout approved by HMDA, Hyderabad vide proceedings No. 15523/1.0/Plg./HMDA/2008-2009, dated 20.07.2010 of survey numbers 348, 349 and 350 at Industrial Park, Pashamylaram, Patancheru Mandal, now in Isnapur Municipal limits, earlier in Medak District and now in Sangareddy District, in any manner including by way of sale, mortgage, lease, gift, settlement, testamentary disposition etc., at her absolute discretion, since the plaintiffs No. 2 and 3 in the suit agreed and consented for the same irrevocably and that they do not have any manner of objection for the same
(2) for consequential mandatory injunction against the defendants No.1 and directing them to mutate the suit schedule-1 and 2 properties respectively in favour of the plaintiff No. 1 as the owner in their respective office records including in the Property Tax Assessment Registers;
(3) for costs of the suit;
(4) to grant such other further relief or reliefs as this Hon'ble deem fit and proper in the circumstances of the case.
If anybody has got any objection for granting of the reliefs to the plaintiffs as prayed for in the suit, may appear before the Hon'ble Court on **12.02.2026** at **10.30** am either in person or through an Advocate duly authorised and submit their objections. In case of failure, the Hon'ble Court will decide the matter without any further notice.
Please take notice as above.
By Order and on the direction of the Hon'ble Court
G. MALOJI RAO
T. SIVASANKAR, G. GIRIDHAR
Advocates
Counsel for the Plaintiffs
Mobile No. 9848543439
Hyderabad,
Dated 22.12.2025.

పేదలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వ నిర్ణయాలు

- ఉపాధిహామీ చట్టాన్ని.. పథకంగా మార్చటం తగదు
- జి ఆర్ఎఎం జి బిల్లు ప్రతులు దహనం
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిర్ణయాలు ఉన్నాయని, ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చే జి ఆర్ఎఎం జి బిల్లును రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలనూ రద్దు చేయాలని కోరారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావుతో కలిసి వెంకట్ మాట్లాడారు. 2005లో వామపక్ష పార్టీల ఎంపీల మద్దతుతో వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేసిన ఫలితంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందని గుర్తు చేశారు.

ఈ చట్టం కారణంగా దేశంలో కోట్లాదిమంది నిరుపేదలు, వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరికిందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అయిందని అన్నారు. గ్రామీణ ప్రాంత కూలీలకు కొంత ఉపశమనం లభించిందని చెప్పారు. అటువంటి చట్టాన్ని మార్చి దాని స్థానంలో మోడీ ప్రభుత్వం విబి జి ఆర్ఎఎం జి పథకాన్ని తీసుకురావడం సహేతుకం కాదన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పార్లమెంట్‌లో పెట్టిన వికసిత్ భారత్ రోజ్ గార్ మిషన్ అనే పథకం ద్వారా కూలీలకు 60 రోజులు పని దినాలు తగ్గించారన్నారు. దీనికి 90 శాతం కేంద్రం బడ్జెట్ కేటాయించాలి కానీ 60శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించటంతో రాష్ట్రాలపై భారం పడుతోందన్నారు. దీని కారణంగా చట్టం బదులు పథకంగా బిల్లు మారిందన్నారు. ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడిందని తెలిపారు. దేశంలో 35 కోట్ల మంది ఉన్న వ్యవసాయ కూలీలు ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారని, ఒకవైపు యంత్రాలు వచ్చి పనులు కోల్పోతున్నారని తెలిపారు. మరోవైపు ఉపాధిచట్టం షరతులు విధించటం సరైనది కాదన్నారు. వెంటనే వీబీజీ రామ్‌జీ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం రద్దును నిరసిస్తూ దేశవ్యాప్తంగా రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 26వ తేదీన నిరసన కార్యక్రమాలు, జనవరి 8 నుంచి 19 వరకు గ్రామ గ్రామాన ప్రచార జాతాలు, 19న కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీనివాసరావు, తుమ్మా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

సావిత్రిబాయి ఫూలే ఓ చరిత్ర

- పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం
- పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సావిత్రిబాయి ఫూలే అంటే ఒక చరిత్ర అని, చదువు ప్రాముఖ్యతను చాటిచెప్పిన మహిళ అని పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి ఫూలే విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. 200 ఏండ్ల కిందటే చదువు ప్రాముఖ్యతను గుర్తించి బడుగు, బలహీన వర్గాలకు, వితంతువులకు, నిరుపేదలకు, నిరాశ్రయులకు చదువు నేర్పించిన చదువుల తల్లి సావిత్రిబాయి అని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన విధ్వంసం నుంచి ప్రజా ప్రభుత్వ పాలనలో వికాసం దిశగా ముందుకు వెళుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని, ఆయన ఒక విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ.1.70 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సర్పంచ్ స్థానాలు గెలిచామని, స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నుడా ఛైర్మన్ కేశ వేణు, డిసిసి అధ్యక్షులు నగేష్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, గ్రంథాలయ ఛైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బిసి సంక్షేమ సంఘం నాయకులు నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, మాడవేడి వినోద్‌కుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నరేగా చట్టమే కావాలి

- ఈ నెల 28 నుంచి జనవరి 8 వరకు గ్రామాల్లో నిరసనలు
- 19న జిల్లా కేంద్రాల్లో నిరసనలు
- వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంతో మంది పేదల పొట్టగొట్టే విబిజి ఆర్ఎఎం జి చట్టం వద్దనీ, దాని స్థానంలో నరేగా చట్టాన్నే పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర సర్కారును వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విబి జి ఆర్ఎఎంజిని వ్యతిరేకిస్తూ చలో అసెంబ్లీ, చలో రాజ్‌భవన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఈనెల 28 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలనీ, జనవరి ఎనిమిది నుంచి 18వ తేదీ వరకు జాతాలను, 19న జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన నిరసనలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. 'నరేగా చట్టాన్ని కాపాడుకుంటాం' అని రిపబ్లిక్ డే రోజు గాంధీ విగ్రహాలు, చిత్రపటాల వద్ద ప్రతిజ్ఞలు చేయాలని కోరింది. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'విబి జి ఆర్ఎఎం జి' రద్దు చేయాలి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ...సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన కూలీ పోరాటాలను గుర్తుచేశారు. ఒక దగ్గర శ్రమను ధారబోసి మరో దగ్గర వెతుక్కోవద్దనీ, పని చేసిన దగ్గర కొట్లాడి జీతాన్ని పెంచుకోవాలని చేసిన పోరాటాలను ప్రస్తావించారు. వామపక్ష పార్టీల పోరాటాలు, పార్లమెంట్‌లోని లెఫ్ట్‌పార్టీల 64 మంది ఎంపీల ఒత్తిడితో యుపిఎ -1 ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఆ చట్టం వచ్చినప్పటి నుంచి గ్రామీణ పేద ప్రజల జీవన ప్రమాణాలు కొంత మేర పెరిగాయని తెలిపారు. కార్మికులకు కూలీని డిమాండ్ చేసే ధైర్యం పెరిగిందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోనూ వేతన డిమాండ్ పెరిగిందన్నారు. అందుకే గ్రామీణ ధనవంతులు, కార్పొరేట్లు ఆ చట్టాన్ని తీసేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారనీ, ఆ క్రమంలోనే ఆ చట్టాన్ని క్రమంగా మోడీ సర్కారు నిర్వీర్యం చేసుకుంటూపోతున్నదని విమర్శించారు. గాంధీ పేరును తొలగించడం చట్ట విరుద్ధమన్నారు.

నల్గొండలో పిఎన్‌బి మెట్‌లైఫ్ కొత్త శాఖ ప్రారంభం

నల్గొండ : జీవిత బీమా సంస్థల్లో ఒక్కటైన పిఎన్‌బి మెట్‌లైఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రాష్ట్రంలోని నల్గొండలో నూతన శాఖను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. వినియోగదారులు ఎక్కడ ఉన్నా వారికి పాలసీ సేవలను, నమ్మకమైన సలహాలను చేరువ చేయాలనే కంపెనీ నిబద్ధతకు ఈ కొత్త బ్రాంచ్ ప్రారంభం నిదర్శనంగా నిలుస్తోందని పిఎన్‌బి మెట్‌లైఫ్ ఎండి, సిఇఒ సమీర్ బన్సాల్ పేర్కొన్నారు. తమకు దేశ వ్యాప్తంగా 182 శాఖలున్నాయన్నారు.

రెండు శాఖల్లో సెంట్రల్ బ్యాంక్ ఎన్ఆర్ఐ డెస్క్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం నాంపల్లి శాఖ, రైన్ బజార్ శాఖలలో ప్రత్యేక ఎన్ఆర్ఐ డెస్క్‌లును ప్రారంభించింది. ఈ కార్యక్రమం లక్ష్యం ప్రవాస భారతీయ (ఎన్ఆర్ఐ) ఖాతాదారులకు ప్రత్యేకమైన, సమర్థవంతమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తాయని ఆ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ ధరాసింగ్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో రీజినల్ హెడ్ డి.కె బరణ్వాల్, జోనల్ కార్యాలయ సీనియర్ అధికారులు, నాంపల్లి, రైన్ బజార్ శాఖల శాఖాధిపతులు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు హాజరయ్యారు.

గ్రామానికి మంచి చేయండి

- మరొక్కసారి ప్రజలే పట్టం కడతారు : ఎమ్మెల్యే పోచారం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామంలో మౌలిక సదుపాయాలు, సిసి రోడ్లు, డ్రయినేజీలు, మంచినీటి సదుపాయాలు గ్రామానికి కావాల్సిన వాటిపై దృష్టి సారించి గ్రామస్తులకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తే మరోసారి ప్రజలే పట్టం కడతారని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఎస్ఎంబీ గార్డెన్‌లో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సంక్షేమం అభివద్ధి ఎల్లప్పుడూ కోరుకునే వ్యక్తిగా ప్రజల ఆశీర్వాదంతో ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. తన రాజకీయ జీవితంలో విమర్శలకు భయపడలేదని, ఇటీవల కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. రాజకీయాల్లో హుందాతనం ఎంతో అవసరం అని హితవు పలికారు. సర్పంచులు ప్రతిరోజూ గ్రామమంతా తిరిగి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, ఏదైనా పెద్ద సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో 111 సర్పంచ్ స్థానాలు కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు గెలవడం ఆషామాషీ కాదంటూ నూతనంగా ఎన్నికైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ నిధుల నుంచి గ్రామాలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే పంచాయతీలకు నిధులు మంజూరు అవుతాయని, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు తోడ్పడాలని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఉపసర్పంచులకు శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు బధ్యానాయక్, పోచారం సురేందర్‌రెడ్డి, మోహన్ నాయక్, మహమ్మద్ అజాజ్, వర్ని ఎఎంసి ఛైర్మన్ సురేష్‌బాబా, బీర్కూర్ ఎఎంసి ఛైర్మన్ శ్యామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు

- సరిపడా బస్తాలులేక ఇబ్బందులు
- ఒక్కో రైతుకు కేవలం 2-3 బస్తాలు
- వరంగల్, కామారెడ్డి జిల్లాల్లో భారీ క్యూలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగి సీజన్ ప్రారంభంతో యూరియా కోసం రైతులు మళ్లీ బారులు తీరారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘానికి బుధవారం 1100 యూరియా బస్తాలు రావడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్దమొత్తంలో వచ్చి వరుసలో నిలబడ్డారు. ఒక్కో రైతుకు కేవలం రెండు నుంచి మూడు బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో రోజులుగా యూరియా కోసం గంటల తరబడి వరుసలో నిల్చొన్నా తక్కువ బస్తాలు ఇస్తున్నారని అన్నారు. ఒక్కసారిగా సహకార సంఘానికి రైతులు తరలిరావడంతో తోపులాట జరిగింది. దాంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల పహారా మధ్య యూరియాను రైతులకు అధికారులు పంపిణీ చేశారు. వారం రోజులుగా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని క్యూలైన్‌లో వేచి చూశారు.

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామంలో యూరియా కొరకు ఒక్కసారిగా రైతులు రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. సొసైటీ కార్యాలయానికి మొత్తం 888 యూరియా బ్యాగులు రాగా రైతులకు విషయం తెలియడంతో యూరియా బ్యాగులు దొరకయేమో అన్న ఆందోళనతో భారీగా కార్యాలయానికి వచ్చారు. టోకెన్ ప్రకారం పంపిణీ చేయడంతో టోకెన్ల కోసం రైతులు చెప్పులు, బ్యాగులు క్యూ లైన్‌లో పెట్టారు.

గ్లోబల్ సమ్మిట్‌లతో సామాన్యులకు ఉపయోగం లేదు

- ఉపాధి హామీకి గాంధీ పేరు తొలగించడం అవమానించడమే : కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీ చట్టం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడం నేరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు విమర్శించారు. విబి జి ఆర్ఎఎం జి పేరు పెట్టడం గాంధీని అవమానించడమేనని అన్నారు. గ్లోబల్ సమ్మిట్, ఫుట్‌బాల్ ఆటల్లాంటి వాటివల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మాయా ప్రభుత్వం నడుస్తోందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అన్నవి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మిథ్యగా మారిందని చెప్పారు. దేవుడిని దేవుడిలా, చరిత్రను చరిత్రలాగా చూడాలి తప్పితే చరిత్రహీనులుగా మిగిలిపోకూడదని అన్నారు. విబి జి ఆర్ఎఎం జి పేరుతో పథకం స్వరూపం, నిధుల కేటాయింపులను మార్చిందని చెప్పారు. వ్యవసాయ కార్మికులపై కడుపు మంటతో బిజెపి వారి కడుపు కొడుతోందని అన్నారు. దేశ భక్తులమని చెప్పుకుంటున్న వాళ్లు దేశ భక్తులా... ప్రజలను భక్షించే రాక్షసులా?అని ప్రశ్నించారు. మోడీ దుష్ట పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రెండేళ్లు కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పులు చేయకుండా రెండేళ్లు కెసిఆర్ ఎందుకు సూచనలు ఇవ్వలేదని అడిగారు. కెసిఆర్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొన్ని మంచి పనులు చేస్తోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, పెన్షన్ రూ.నాలుగు వేలు ఇవ్వాల్సిందేనని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను తగ్గించడం సరైంది కాదన్నారు.

జర్నలిస్టుల విభజన సరికాదు

- జిఒ 252ను సవరించాలి
- డెస్క్‌జర్నలిస్టులకూ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి
- డెస్క్, జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆఫ్ తెలంగాణ (డిజెఎఫ్‌టి) డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్కింగ్ జర్నలిస్టులలో విభజనను తీసుకొచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (టిజెఎఫ్‌టి) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అక్రిడిటేషన్ కార్డుల విషయంలో డెస్క్ జర్నలిస్టులు, రిపోర్టర్లును వేరు చేసేలా ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకోవడం సహేతుకం కాదని పేర్కొంది. అక్రిడిటేషన్ పాలసీకి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 252ను సవరించాలని ప్రభుత్వానికి టిజెఎఫ్‌టి విజ్ఞప్తి చేసింది. డెస్కు జర్నలిస్టులకు బస్ పాసుల విషయమై ఐ అండ్ పిఆర్ అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది.

వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టుల సమావేశం బుధవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా టిజెఎఫ్‌టి కొత్తగా ఏర్పాటైంది. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడంతో పాటు, డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... రిపోర్టర్, డెస్క్ జర్నలిస్టులిద్దరూ వర్కింగ్ జర్నలిస్టు కిందికే వస్తారని, అలాంటిది వారిని విభజించడం సరికాదన్నారు. ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువ అనే వివక్ష చూపించేలా అధికారులు వ్యవహరించటం ఏంటని ప్రశ్నించారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వబోమని, మీడియా కార్డుల పేరిట కొత్తగా కార్డులు జారీ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఇది డెస్క్ జర్నలిస్టులను సెకండ్ గ్రేడ్‌కి నెట్టడమే తప్పా ఇంకోటి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి ధర్మాన్ని కాపాడేందుకు ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న డెస్క్ జర్నలిస్టులకు జిఒ 252 శరాఘాతం లాంటిదేనన్నారు. పోరాడి సాధించుకున్న అక్రిడిటేషన్ హక్కును గుంజుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు, భవిష్యత్తులో ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న ఇండ్ల స్థలాల కేటాయింపు విషయంలో స్క్రీనింగ్ చేసేందుకే ఈ విభజన అనే అనుమానం అందరిలో ఉందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డులకు ఒకే రకమైన సంక్షేమ పథకాలు ఉంటాయని అధికారులు చెప్తున్నారు..అలాంటప్పుడు రెండు కార్డులు తీసుకురావాల్సిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. గతంలో ఇచ్చినట్టు వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్‌యుజె అధ్యక్ష, కార్యదర్శులు బి అరుణ్ కుమార్, బి జగదీశ్, టిడబ్ల్యుజెఎఫ్ ఉపాధ్యక్షుడు బి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి గంద్ర నవీన్, డబ్ల్యుఐజె రాష్ట్ర సెక్రటరీ రావికంటి శ్రీనివాస్, పలువురు సీనియర్ రిపోర్టర్లు పాల్గొని మద్దతు ప్రకటించారు.

డిజెఎఫ్ టి కొత్త కమిటీ ఎన్నిక..

డిజెఎఫ్ టి రాష్ట్ర అధ్యక్షుడిగా బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా నిస్సార్, ఉపాధ్యక్షుడిగా కెవి రాజారామ్, జాయింట్ సెక్రెటరీగా విజయ తదితరులు ఎన్నికయ్యారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

నేను కాంగ్రెస్‌లోనే ఉన్నాను..

- ఎమ్మెల్యే దానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని, అదే తన స్పెషల్ అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదు కానీ తాను మాత్రం కాంగ్రెస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని జహీరానగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన పై విధంగా సమాధానం చెప్పారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటే ప్రజలంతా ఉన్నారని తెలిపారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 300 డివిజన్‌లలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం స్వయంగా తాను ప్రచారం చేస్తానన్నారు.

యూనివర్సిటీ ఉద్యోగాలకు అభ్యర్థుల మాల్ ప్రాక్టీస్

- ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుకు నిర్వహించిన నాన్-టీచింగ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ఇద్దరు అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్టు గచ్చిబౌలిలోని విశ్వవిద్యాలయం రిజిస్ట్రర్ డాక్టర్ దేవేష్ నిగమ్ ఫిర్యాదు చేసినట్టు గచ్చిబౌలి సీఐ బాలరాజు తెలిపారు. పరీక్ష సమయంలో అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, మైక్రోఫోన్లు, బ్లూటూత్ ఇయర్‌ఫోన్లు వంటి నిషేధిత ఎలక్ట్రానిక్ పరికరాలను కలిగి ఉన్నారని, పరీక్ష రాసేటప్పుడు వీటిని ఉపయోగించారని తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా, నిందితులపై కేసు నమోదు చేశారు. హర్యానాకు చెందిన అనిల్ కుమార్, సతీష్ ఇద్దరిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. తదుపరి దర్యాప్తు జరుగుతోందని సీఐ తెలిపారు.

ఉత్సాహం పుస్తక మిత్రుల నడక

ప్రజాశక్తి - కల్చరల్

హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ నిర్వహణలో లోయర్ ట్యాంక్ బండ్ నుంచి యెన్ టి ఆర్ స్టేడియం వరకు వందలాది మంది పుస్తక మిత్రుల నడక బుక్ వాక్ పేరిట ఉత్సాహం గా ఉత్తేజ పూరిత నినాదాలు మధ్య సాగింది. సాహితీ కారులు ఆచార్య ఎస్‌వి సత్యనారాయణ నిఖిల్ బి ఎస్ రాములు రెంటాల జయదేవ్ మెర్సీ మార్గరెట్ సజయ రియాజ్ వెన్నెల గద్దర్ తదితరులు బుక్‌వాక్‌లో ముందు నడిచారు. బుక్‌వాక్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణరావు ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా పుస్తకం విలువ తగ్గలేదన్నారు. వికాసానికి విజ్ఞానంకి కిటికీల వంటివి పుస్తకాలు అన్నారు. పుస్తక వితరణ డబ్బాను ఆయన ప్రారంభించారు. ప్రొఫెసర్ కోదండ రామ్ ప్రముఖ జర్నలిస్ట్ రామచంద్ర మూర్తి గీత రచయిత సుద్దాల అశోక్ తేజ్ వీక్షణం వేణు గోపాల్ జర్నలిస్ట్ వి రహత్ అలీ గుండు వల్లీశ్వర్ శిల్పి రమణ రెడ్డి ఆనందాచారి తదితరులు కూడా బుక్‌వాక్‌లో భాగస్వామ్యులు అయ్యారు. బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు యాకుబ్ కార్యదర్శి వాసు బుక్.వాక్ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

జర్నలిస్ట్ హాస్యావధాని శంకరనారాయణకు జీనియస్ రికార్డ్

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖ జర్నలిస్ట్ హాస్య అవధాని శంకర నారాయణకు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు ధ్రువపత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి ద్వారా రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా ముఖ్య సమన్వయ కర్త టి సుభాషిణి నమోదు ధ్రువ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన మూర్తి మాట్లాడుతూ సాహిత్య విలువలుతో రచనలు సున్నిత హాస్యంతో రాసిన శంకర నారాయణ జర్నలిజం రంగం గుర్తింపు పొందారని అభినందించారు. పాటల రచయిత రాయా రావు విశ్వేశ్వర రావు మాట్లాడుతూ శంకర నారాయణ అందుకున్న ఎన్నో అవార్డులుకు మరి ఒకటి జత ఇనది అని చెప్పారు. శంకర నారాయణ స్పందన తెలుపుతూ త్యాగరాయ గానసభ తనకు కళా జన్మ భూమి అన్నారు. నరేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

హిల్ట్ పాలసీని పున:సమీక్షించాలి

- జిఒ నెం.27లో స్పష్టత కరువు
- ప్రభుత్వం తక్షణమే స్పందించాలి
- పారిశ్రామిక వర్గాల వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్)పై పారిశ్రామిక వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈ పాలసీ గందరగోళంగా ఉందని.. దీనిపై పారిశ్రామికవేత్తలతో కలిసి చర్చించి పునసమీక్షించాలని పరిశ్రమల ప్రతినిధులు కోరారు. పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్ రాయితీలపైనా స్పష్టత ఇవ్వాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ ఆర్ రవి కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె మహేశ్వరి, టిఐఎఫ్ ప్రెసిడెంట్ కె సుధీర్ రెడ్డి, చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, ఐఎఎల్ఎ ఛైర్మన్ స్వామి గౌడ్, ఎఫ్ఇటిఎస్ఐఎ ప్రెసిడెంట్ రాజమహేంద్ర రెడ్డి, టిఐఎస్ఎంఎకు చెందిన అనిల్ అగర్వాల్, ప్రకాశ్ గొయాంక, టిఎస్ఒఎడిఎ జనరల్ సెక్రటరీ వెంకట్ ఎన్ఎస్‌కె పాల్గొన్నారు. ఈ పారిశ్రామిక సంఘాలు దాదాపు 50వేల పైగా పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్‌కు విఘాతం కలిగించేలా ఉన్న కొన్ని ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలన్నారు. డిస్కామ్‌ల తప్పుడు విధానాలు, పెనాల్టీల వల్ల పరిశ్రమల విద్యుత్ బిల్లులు అకస్మాత్తుగా 3 నుండి 5 రెట్లు పెరిగాయన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కావాల్సిన నోఅబ్జెక్షన్ సర్టిఫికేట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పరిశ్రమలు విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి ఇచ్చే రాయితీలపై స్పష్టత కావాలని కోరారు. జిఒ నెంబర్ 27, పరిశ్రమల తరలింపునకు సంబంధించిన ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్) గందరగోళంగా ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న పరిశ్రమలను తరలించాలనే ప్రతిపాదనలో స్పష్టత లేదన్నారు. తరలింపునకు అయ్యే ఖర్చు, ప్రత్యామ్నాయ స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం మౌనంగా ఉందని పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల తరలింపు అనేది ఇళ్లను మార్చినంత సులభం కాదని, దీనికి ఏళ్ల తరబడి ప్రణాళిక అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ జిఒను తాత్కాలికంగా నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఏకపక్షంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోకుండా తీసుకోకుండా, పారిశ్రామిక సంఘాలతో చర్చలు జరిపి విధానాలను రూపొందించాలని వారు కోరారు.